క్లుప్తంగా

కె.కె.రాజును కలిసిన అంగన్‌వాడీ టీచర్లు


అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను అభినందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: నూతనంగా నియామకమైన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజును బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఆయన అభినందించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలకు సేవలందించి వారి ప్రశంసలు పొందాలని కె.కె.రాజు ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారం దిశగా 'గ్రీవెన్స్'

సీతమ్మధార: నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజలు సమస్యలపై విన్నవించుకున్నారు. వారి వద్ద నుంచి వినతిపత్రాలు, దరఖాస్తులు తీసుకుని అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలు తక్షణం పరిష్కరించినట్లు కె.కె.రాజు చెప్పారు. మరికొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో 25న పరస

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఈ నెల 25న ముత్యాలమ్మ అమ్మవారి పరస నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున అమ్మవారికి పసుపు, కుంకుమ, ఫల పుష్పాలు సమర్పిస్తారని, భక్తులు పాల్గొనాలని కోరారు.

గిరిజన భాషలపై వర్క్‌షాప్

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన భాషలపై రుషికొండలో గల గిరిజన భవన్‌లో శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడే కోయ, సవర, ఆదివాసీ ఒరియా, జాతపు, కువి, కొండదొర భాషలు వంటి లిపి లేని గిరిజన భాషలను నిర్మించిన ఎంటీవీ – ఎంఎల్ఈ ఉపాధ్యాయ శిక్షణ మాడ్యూల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో మాతృభాష ఆధారిత బహుభాష విద్యను సమగ్ర విద్య, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడానికి ఈ వర్క్‌షాప్ కృషి చేస్తుందన్నారు. బోధన, అభ్యాసం, నైపుణ్యం, అభివృద్ధి, పిల్లల అభ్యాస అలవాట్లు అంచనా వేయడం, ప్రాథమిక స్థాయిలో లేదా మాతృభాషలో చదవడం, ఇతర భాషల సహాయంతో విద్యారంగాన్ని బలోపేతం చేసే అంశాలపై అవగాహన కల్పించారు.

రోడ్డుపై అడ్డంగా వాహనాల పార్కింగ్


బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డుపై నిలిపిన వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆర్చి రోడ్డులో ఇరానీ టీ షాపు వద్ద రహదారిపై వాహనాలను అడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను రోడ్డుపై ఇష్టానుసారంగా పార్క్‌చేసి వదిలేయడంతో ప్రతి రోజు ఇదే పరిస్థితి నెలకొంటోంది. ట్రాఫిక్ అధికారులు స్పందించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం

- సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన
- అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు
- సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతమ్మధార: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధనకు సచివాలయం–వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా చిట్టచివరి లబ్ధిదారుడి వరకూ సంక్షేమ ఫలాలను అందిస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. కొన్ని టీవీ చానళ్లు, పత్రికలు, ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పినట్లు ఆడుతున్నాయని ఆరోపించారు. జర్నలిజం అనేది ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలే తప్ప.. ఒకరికి కరపత్రంగా మారకూడదని హితవు పలికారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్ అవినీతి రహితమైన పారదర్శక పాలన అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నా.. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను ఇక్కడ అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని కె.కె.రాజు పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. మాస్కుల పంపిణీ, వ్యాక్సినేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు


మధుసూదన్‌నగర్‌లో అవ్వతో మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు మధుసూదన్ నగర్ కొండవాలు ప్రాంతంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి కొండవాలులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని నివాసులకు వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొండవాలు, మురికివాడల్లోని అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు, విశిష్టమైన సేవలు అందుతున్నాయని కె.కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, డైరెక్టర్లు దిడ్డి రమేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, పైడి రత్నాకర్, నాయకులు గోవింద్, క్రిష్ణ, రమణ, శ్రీను, రామారావు, లావణ్య, కె.ఈశ్వరరావు, సీతయ్యరెడ్డి, దేవి, బాల, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్, అపోలో ఆస్పత్రి సౌజన్యంతో వాకర్స్ పార్కులో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ శశాంక్ చుండూరి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జి.గణేష్ వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈసీజీ, సుగర్, బీపీ పరీక్షలు చేసి అవసరమైన సలహాలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు


ప్రత్యేక పూజల్లో భక్తులు, అర్చకులు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం వినిపించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సతీష్‌కుమార్ దంపతులు ఇందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వెంకన్న సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

సీతమ్మధార: ఏపీలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపు తథ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ధీమా వ్యక్తం చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర, నెల్లూరు, చిత్తూరు, ఒంగోలు, రాయలసీమ ప్రాంతాల్లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారన్నారు. ఇందులో బీజేపీ ప్రధాన పోటీగా ఉంటుందని చెప్పారు. అధికార పార్టీపై ఉద్యోగులు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. నాలుగు ఎమ్మెల్సీ స్థానాల్లో తాము విజయం సాధిస్తామని జోస్యం చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధే తమ పార్టీని గెలిపిస్తుందన్నారు. ఈ మేరకు 14వ వార్డులోని ఓటర్లను కలిసి తొలి ప్రాధాన్యతా ఓటును బీజేపీకి వేయించాలని పార్టీ శ్రేణులకు వీర్రాజు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, అరకు ఇన్‌చార్జి పరశురాంరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'హ్యూమన్ జెనిటిక్స్' సదస్సు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం హ్యూమన్ జెనిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నంచి 25వ తేదీ వరకు విభాగ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షుడు ఆచార్య జి.పద్దయ్య తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా 'న్యూ జెనిటిక్స్ అండ్ ఇట్స్ కాంట్రిబ్యూషన్స్ టు హ్యూమన్ హెల్త్ అండ్ వెల్త్' అనే అంశంపై సదస్సును నర్విహిస్తున్నామన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనిటిక్స్ 47వ వార్షిక సమావేశం నిర్వహిస్తామన్నారు. సదస్సుకు విభాగ పూర్వవిద్యార్థులు, ఈ రంగంలో నిపుణుల హాజరవుతారన్నారు. సదస్సులో భాగంగా నోబెల్ గ్రహీత డాక్టర్ గ్రెగ్ సెయెంజా వర్చువల్ విధానంలో కీలకోపన్యాసం చేస్తారని సదస్సు కన్వీనర్ ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. సదస్సులో అమెరికా, యూరప్ దేశాల నుంచి జెనిటిక్స్, కాన్సర్ వంటి అంశాలపై పరిశోధనలు జరిపే ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరవుతున్నారన్నారు. సదస్సుకు 500 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

కాలభైరవుడికి కూష్మాండ ఫల దీపారాధన



కాలభైరవుడికి దీపారాధన చేస్తున్న భక్తులు

సీతంపేట: పుష్య మాసం, బహుళ అమావాస్య సందర్భంగా శనివారం స్థానిక గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో కాళభైరవ స్వామికి కూష్మాండ ఫల దీపారాధన చేశారు. స్థానిక భక్తులు బూడిద గుమ్మడి కాయలో దీపాలు వెలిగించి కాలభైరవుడికి పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు గంగవరపు భాస్కరశర్మ భక్తుల చేత పూజలు చేయించారు. అక్కయ్యపాలెం లలితా పీఠంలో ప్రత్యంగిరా హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షించారు.

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


నక్కవానిపాలెం 60 ఫీట్ రోడ్డులో మ్యాన్‌హోల్ దుస్థితి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు 60 ఫీట్ రోడ్డులో ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు నుంచి శ్మశానవాటిక వైపు వెళ్లే మార్గంలో ఉన్న మ్యాన్‌హోల్ ఒక వైపు పైకిలేచి ఉండటంతో రాత్రివేళ రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.

– జగదీష్, నక్కవానిపాలెం

ఐటీఐలో వేమన జయంతి


వేమన పద్యాల పోటీల్లో విజేతలతో సత్తి సునీల్‌రెడ్డి తదితరులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ప్రొఫెసర్ ఉమాదేవి ఆధ్వర్యంలో శనివారం యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కేంద్ర సీఐడీ రిటైర్డ్ ఎస్పీ సత్తి సునీల్‌రెడ్డి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగి వేమన పద్యాల గొప్పదనం నేటి తరానికి తెలిసేలా విద్యార్థులకు వివరించాలన్నారు. నాటి సాంఘిక దురాచారాలను ఖండిస్తూ పండితపామరులకు కూడా అర్థమయ్యేలా వేమన గొప్ప సందేశాలు ఇచ్చారన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెంటకోట రామారావు, పి.ఫ్రాన్సిస్ ఆనంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

ఎంవీపీకాలనీ : వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రొఫెసర్ వెంకట శేషయ్య అన్నారు. ఏపీలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అటవీశాఖ అధికారుల కోసం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో నిర్వహిస్తున్న వర్కుషాప్ 2వ రోజు కొనసాగింది. 2వ రోజు కార్యక్రమంలో భాగంగా జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులతో పాటు పలు రకాల జునోటిక్ వ్యాధులను నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట శేషయ్య మాట్లాడుతూ జంతువుల్లో వ్యాపించే వ్యాధుల నిర్ధారణ, శాంపిల్స్ సేకరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. దీంతో పాటు మృతి చెందిన జంతువులను పరీక్షించే విధానం, వాటి అంత్యక్రియల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జూలోని పలు జంతువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం వర్క్‌షాపునకు హాజరైన ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పలు జంతువులను పరిశీలించారు. డాక్టర్ హిమజతో పాటు జూ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ఏసీఎఫ్ మంగ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం రేపు



డాబాగార్డెన్స్: నగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవీ కల్యాణ మండపం సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, నగరంలో గల అన్ని వాసవీక్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు తెలిపారు. ఆ రోజు వేకువ జాము 3 గంటలకు మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, ఉదయం 7.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక ఆత్మార్పణ అలంకరణ ఉంటాయన్నారు. 8 గంటలకు భక్తులచే ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, 8.30కి స్వర్ణపుష్ప పూజ, సహస్రనామార్చన, 9.30 గంటలకు మహిళలచే సామూహిక సహస్రనామ పారాయణ, 10.30కి వాసవీ హోమం, మధ్యాహ్నం 12 గంటల నుంచి నారాయణ సేవ నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్యక్రమ చైర్మన్ జీవీఆర్ కుమార్, చెక్కా చందన తెలిపారు.

సమాచారమ్

జోన్‌–5లో ఆధార్ కేంద్రాలివే..



జీవీఎంసీ జోన్‌–5 కార్యాలయం

వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్‌–5 పరిధిలోని పలు వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఆధార్ కార్డులో తప్పులు, సవరణలు, కొత్తగా నమోదు వంటి ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నెల 24 వరకు ప్రత్యేక క్యాంపులు కొనసాగుతాయి. ఉత్తర నియోజకవర్గంలోని వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆయా వార్డుల ప్రజలు సద్వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

ఆధార్ సేవలకు సంప్రదించండి

వార్డు సచివాలయం	కోడ్ నంబర్	ఇన్‌చార్జి	ఫోన్ నంబర్
న్యూ వేంకటేశ్వర కాలనీ	21086246	కె.మోహన్‌రావు	94936 32327
నరసింహనగర్	21086253	కె.కోటేశ్వరరావు	97033 30393
సంజీవ్ కాలనీ	21086260	ఎస్.శివరామకృష్ణ	96520 96465
అంబేడ్కర్ కాలనీ	21086287	జి.ప్రభాకర్	94943 10435
మహతి కాలనీ	21086288	జి.రంజిత	84648 39310
మాధవధార	21086289	జి.వెంకటేష్	99667 14743
గాంధీ నగర్	21086290	ఎస్.నవ్యపల్లవి	78426 23525
యూడీఏ కాలనీ	21086294	ఎస్.నరేంద్ర	81257 17262
భవానీ గార్డెన్	21086302	జి.భవాని	96663 67380
గణేష్ నగర్	21086303	ఎం.కుమారి	87906 98924
ఇండస్ట్రియల్ కాలనీ	21086340	ఉత్తమ్ చౌదరి	90523 36526

అక్కయ్యపాలెం పరసకు సర్వం సిద్ధం


ఆలయ వీధిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు


విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి ఆలయాలు

సీతంపేట: అక్కయ్యపాలెంలో మూడుగుళ్ల వద్ద ఆదివారం జరగనున్న సీతారాముల పరసకు గౌరీ సేవా సంఘం ఘనంగా ఏర్పాట్లు చేసింది. భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వేంకటేశ్వర స్వామి, సీతారాముల వార్ల పరస నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు సంఘ అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ తెలిపారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా కమిటీ చర్యలు చేపట్టింది. అమ్మవార్లు, స్వామి ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలదండలు, వేప మండలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం తెల్లవారుజాము 5.30 గంటలకు అమ్మవార్ల తొలి పూజతో పరస ఉత్సవం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించుకోవచ్చన్నారు. ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు సంప్రదాయ కోలాటం, సేవా గరిడీ, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పరస మహోత్సవం సాగుతుందన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, చైర్మన్ రాపేటి మాలినాయుడు, ఉపాధ్యక్షుడు మాదేటి శ్రీనివాసరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ మళ్ల త్రినాథరావు తదితరులు శనివారం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లలితా పీఠంలో కుర్తాళం పీఠాధిపతి


కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సుమారు ఏడు నెలల తర్వాత అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి విచ్చేశారు. స్వామి వారి 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 5 వరకు చతుర్థ శాహ్నిక అష్టముఖ గండ భేరుండ జ్వాలా నారసింహ సుదర్శన మహా యాగం నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి పాల్గొంటారని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఫిబ్రవరి 5 వరకు లలితా పీఠంలో వేంచేసి ఉంటారని, ఈ నెల 25 నుంచి భక్తులకు దర్శనం, మంత్రోపదేశం చేస్తారని చెప్పారు. స్వామివారిని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని, దీని కోసం తన నంబర్ 98492 86779లో సంప్రదించాలని కృష్ణసేన్ కోరారు.

ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగికి టోకరా

సీతమ్మధార: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించారని ఓ బాధితుడు ఫోర్త్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా.. విజయనగరం జిల్లా జమ్మునారాయణపురానికి చెందిన కాయల చంద్రశేఖర్ మధురానగర్ ఇన్ హోటల్ ఎదురుగా సర్వేక్ష అకాడమీలో ఏడబ్ల్యూఎస్ కోర్సు నేర్చుకోవడానికి 2021 మార్చిలో చేరాడు. ఈ కోర్సు నిమిత్తం రూ.85 వేలు చెల్లించాడు. మూడు నెలల్లో కోర్సు పూర్తవుతుందని నిర్వాహకుడు తెలిపాడు. పది నెలలు దాటినా ఇంకా కోర్సు అవ్వలేదని చెప్పి.. తన స్నేహితుడి వద్ద సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని, అందుకు రూ.1.10 లక్షల అవుతుందని నమ్మించాడు. ఆ మొత్తం నగదు కశిరెడ్డి దేవీకిరణ్‌కు కట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉద్యోగం రాలేదని అడగ్గా.. ఇదిగో వేయిస్తానని చెప్పి రోజూ తిప్పిస్తుండటంతో ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావుకు చంద్రశేఖర్ ఫిర్యాదు చేసి తన న్యాయం చేయాలని కోరాడు.

విద్యార్థులకు జ్ఞానాన్ని అందించండి


సర్టిఫికెట్లు అందజేస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూక్యాంపస్: జ్ఞానాన్ని సముపార్జించడం ఎంత ముఖ్యమో ఆ జ్ఞానాన్ని విద్యార్థులకు పంచడం అంతే అవసరమని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. శనివారం ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రంలో ఉన్నత విద్య మండలి, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏషియా, ఏయూ సంయుక్తగా నిర్వహించిన 21వ శతాబ్దపు నైపుణ్యాలు–బోధన పద్ధతుల సదస్సు ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ విద్యార్థులకు వర్తమాన జ్ఞానాన్ని అందించే ప్రక్రియలో విభిన్న నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. 21వ దశాబ్దంలో బోధన పద్ధతులను నవీకరించుకుని వాటిని విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉపయుక్తంగా అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. నూతన విద్య విధానంలో వచ్చిన మార్పులను ఆకళింపు చేసుకుంటూ వీటిని అనుగుణంగా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ దినకర్ రెడ్డి, కార్యక్రమ గౌరవ అతిథి హెచ్ఆర్‌డీసీ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకట కృష్ణ, కార్యక్రమ సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.